
ఉద్యోగమా.. నిరుద్యోగ భృతా..?



- ఏదో ఒకటి చెప్పండి బాబూ!
- గంపెడాశలతో నిరుద్యోగుల ఎదురుచూపు

సాక్షి నెట్‌వర్క్‌: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగి భృతి కింద నెలకు రూ.3వేలు చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ- బీజేపీ- జనసేన కూటమి ప్రభుత్వం నెల దాటినా ఊసే ఎత్తలేదు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు హామీ మేరకు ఉద్యోగాలు భర్తీ చేయలేక నాలుగేళ్లు కాలయాపన అనంతరం ఎన్నికల సంవత్సరంలో హడావుడిగా నిరుద్యోగ భృతి అమలు చేశారు. అదీ అరకొరగా. ఇప్పుడు కూడా అదే హామీ ఇచ్చారు. జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేసి.. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతితో ఆదుకుంటారా.. లేక గతంలో మాదిరే కాలయాపనతో మభ్యపెడతారా అని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో 3,24,683 మంది అభ్యర్థులు ఉద్యోగాలు/ నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఎలా స్పందిస్తుందో చూడాలి.

నియోజకవర్గాల వారీగా ఇళ్ల సంఖ్య

ధర్మవరం నియోజకవర్గం	1,02,052
పుట్టపర్తి నియోజకవర్గం	79,623
కదిరి నియోజకవర్గం	1,02,725
రాప్తాడు నియోజకవర్గం (రామగిరి, సీకే పల్లి, కనగానపల్లి)	40,283

వీరంతా ఉద్యోగం/ నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపు

ఈసారైనా అమలు చేస్తారా?



నేను 2014లో డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిరుద్యోగభృతి ఇస్తామని చెబితే పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాను. అయినా నాకు ఇవ్వలేదు. ఈసారి మళ్లీ ఇంటికో ఉద్యోగం లేకపోతే నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పారు. మరి ఈసారైనా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇస్తారా లేదా చూడాలి.

– మధుసూదన్‌రెడ్డి, శీతిరెడ్డిపల్లి, అమడగూరు మండలం

ఉద్యోగావకాశాలు కల్పించాలి



చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలి. ఉన్నత చదువులు చదువుకుని చాలామంది సరైన ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగమో.. లేక నిరుద్యోగ భృతో ఏదో ఒకటి కల్పించి కుటుంబాలను ఆదుకోవాలి.

– మంజులదేవి, ఎంబీఏ, ధర్మవరం

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు



నేను బీఎస్సీ, డీఈడీ పూర్తి చేశాను. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో ఉద్యోగం లేదా రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని నమ్మాం. అధికారంలోకి వస్తే యువతకు అండగా ఉంటారని భావిస్తున్నాం. అయితే ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి విధివిధానాలూ రూపొందించలేదు. సీఎం సహా ఏ మంత్రీ దీని ఊసే ఎత్తడం లేదు.

– అనిల్, బుక్కపట్నం

ఉద్యోగం కోసం నిరీక్షణ



బీటెక్‌ పూర్తి చేసిన నేను ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించారు. నోటిఫికేషన్‌ ఎప్పుడు వదులుతారా.. ఎప్పుడెప్పుడు జాబ్‌ వస్తుందా అనే ఉత్కంఠతో ఉన్నా. ఒక వేళ జాబ్‌ లేకున్నా నిరుద్యోగ భృతి అయినా వస్తుందని భావిస్తున్నా.

– సాకే సయ్యద్‌ బాషా, ముదిగుబ్బ

ప్రకటన చేయాలి



నిరుద్యోగ భృతి హామీ అమలుపై చంద్రబాబు ప్రభుత్వం వెంటనే ఒక ప్రకటన చేయాలి. గ్రామాల్లో మాలాంటి నిరుద్యోగ యువతీ యువకులు దీనికోసం ఎదురు చూస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. చదువుకు తగ్గ ఉద్యోగం దొరికితే కుటుంబం హాయిగా సాగుతుంది.

– సాకే హరీష్, రామగిరి మండలం

ఎదురు చూస్తున్నాం



నేను డిగ్రీ పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నం చేసి అలసిపోయాను. నాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించుకోవడానికి పెట్రోలు బంక్‌లోకి పనికి వెళుతున్నాను. ఎన్నికల్లో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి అందించి ఆదుకోవాలి.

– చందమామ గంగాధర్, తాడిమర్రి

భృతి ఇస్తే బాగుంటుంది



టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి నెల దాటినా ఇంత వరకు దాని ఊసే లేదు. హామీ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తే బాగుంటుంది. జాబ్‌ క్యాలెండర్‌ కూడా వెంటనే ప్రకటించాలి.

– షేక్‌ ముంతాజ్, ఎన్పీ కుంట

స్పష్టత ఇవ్వాలి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటింది. జాబ్‌ క్యాలెండర్‌ ఎప్పుడు ప్రకటిస్తారు? నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి అమలు చేస్తారు. దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో మాదిరిగా కాకుండా జనరల్‌ అభ్యర్థులతో సహా నిరుద్యోగులందరికీ భృతి ఇవ్వాలి. లేనిపక్షంలో ఆందోళనకు దిగాల్సి ఉంటుంది.

–నరేంద్రరెడ్డి, నిరుద్యోగి, వేల్పుమడుగు, బత్తలపల్లి మండలం

ఉలుకు పలుకు లేదు



నేను 2012లో డిగ్రీ పూర్తి చేశాను. దాదాపు 8 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్నాను. నాలాంటి ఎంతో మంది జాబ్‌ క్యాలెండర్‌ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఉలుకు పలుకు లేదు. ఇచ్చిన హామీ మేరకు జాబ్‌క్యాలెండర్‌ విడుదల చేయాలి. నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి మంజూరు చేయాల్సిందే.

– గోపాలకృష్ణ, బసంపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

ఆశలన్నీ ప్రభుత్వంపైనే..



ఇంటికో ఉద్యోగం.. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అని ఇచ్చిన హామీని చంద్రబాబు ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఉద్దేశంతో చాలామంది కోచింగ్‌లకు వెళ్లి సన్నద్ధమయ్యారు. కాలయాపన చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయాలి. లేదా నిరుద్యోగ భృతి అయినా అందించాలి.

– గణేష్, డిగ్రీ, ధర్మవరం అర్బన్‌

నిరుద్యోగ భృతిపై సందేహాలెన్నో..?



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి నెల రోజులు దాటింది. ఇంటికో ఉద్యోగం/ నిరుద్యోగ భృతి హామీపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టతా రాలేదు. ఇంటర్, ఆపై చదువులు చదువుకున్న వారికే వర్తిస్తుందా.. పదో తరగతి ఉత్తీర్ణులై నిరుద్యోగిగా ఉన్న వారికీ వర్తిస్తుందా అన్న అంశంపై సందేహాలు ఉన్నాయి.

– ఆజాద్, జీనేకుంట, గాండ్లపెంట మండలం

రూ.3 వేలు ఇవ్వాల్సిందే



నేను ఎంబీఏ పూర్తి చేశాను. ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం లేక స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు విస్మరిస్తోంది. ఎన్నికలకు ముందు రూ.3 వేల నిరుద్యోగ భృతి లేదా ఇంటికో ఉద్యోగం ఇస్తామని గొప్పలు చెప్పుకున్నారు. ఇప్పుడు హామీల గురించి మాట్లాడక పోవడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిరుద్యోగ భృతి ప్రకటించాలి. అలాగే జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేయాలి.

– లోకేష్, గంగినేపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

క్లుప్తంగా

ముత్యాలమ్మతల్లి గ్రామోత్సవం



అమ్మవారి ఊరేగింపు

ధర్మవరం అర్బన్‌: పట్టణంలో ముత్యాలమ్మ తల్లి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలోని మేడాపురం రోడ్డు సమీపాన ముత్యాలమ్మతల్లికి నిర్వాహకులు నాయనిగారి నరసింహారెడ్డి స్వామి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏడు గుర్రాల బంగారు రథంపై ముత్యాలమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంలో ఆల్‌ ఇండియా బార్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ అదిష్‌ సి.అగర్వాల్‌ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో కళాకారులు నృత్యాలు, చెక్కభజనలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.

స్వయం ఉపాధిలో రాణించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్‌: మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని ఏడీసీసీ బ్యాంకు మేనేజర్‌ వెంకటాచలం పిలుపునిచ్చారు. పట్టణంలోని శుభయశ్రీ శారీస్‌ ప్రింటింగ్‌ యూనిట్‌లో నాబార్డ్‌ సహకారంతో లిడ్‌ కార్యక్రమం కింద మహిళా సంఘాల సభ్యులకు శ్యారీస్‌ హ్యాండ్‌ బ్లాక్‌ ప్రింటింగ్‌పై 20 రోజుల శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు, ఉపకరణాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఏడీసీసీ బ్యాంక్‌ మేనేజర్‌ వెంకటాచలం, వర్డ్‌ సంస్థ అధ్యక్షురాలు శారద హాజరై మాట్లాడారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు.

ట్రిపుల్‌ ఐటీకి ఎంపిక

కనగానపల్లి: మోడల్‌ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్‌ ఐటీ కళాశాలలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ రవికిరణ్‌ తెలిపారు. పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు నాగశ్రీ, గోవర్దన్‌ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రస్తుతం వీరిద్దరూ ఇడుపులపాయ, ఒంగోలులోని ట్రిపుల్‌ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



ఉత్తమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

నల్లమాడ: బాసంవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి తండ్రి ఆమళ్లదిన్నె గంగిరెడ్డి(58), కుటాలపల్లికి చెందిన నాయకుడు చెన్నారెడ్డి తల్లి ఉత్తమ్మ(57) అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి సోమవారం ఆయా గ్రామాలకు వెళ్లి గంగిరెడ్డి, ఉత్తమ్మ మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మండల కన్వీనర్‌ కె.సూర్యనారాయణ, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు కుళ్లాయినాయక్, శంకర్‌నాయక్, మాధవరెడ్డి, చంద్రహాసరెడ్డి, ఏ.మాధవరెడ్డి, గోవిందరెడ్డి, డీసీ తిరుపాల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెన్నక్రిష్టారెడ్డి, గంగిరెడ్డి, శేఖర తదితరులు ఉన్నారు.

సాయి భక్తుల పాదయాత్ర

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి బాబా దర్శనానికి వచ్చిన మహారాష్ట్ర భక్తుల పాదయాత్ర సోమవారం కొనసాగింది. ఆదివారం సాయంత్రం ధర్మవరం రైల్వే స్టేషన్‌ నుంచి చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల గ్రామానికి పాదయాత్ర చేరుకున్న విషయం తెలిసిందే. తిరిగి సోమవారం ఉదయం అక్కడి నుంచి పాదయాత్రను ప్రారంభించారు. సత్యసాయి బాబా చిత్రపటాన్ని పల్లకీలో కొలువుదీర్చిన భక్తులు సత్యసాయి భక్తిగీతాలను ఆలపిస్తూ కదిలారు. వెల్దుర్తి క్రాస్, అమిదాలకుంట మీదుగా కొత్తచెరువు మండలంలోకి పాదయాత్ర ప్రవేశించింది. పాదయాత్రలో మహారాష్ట్రకు చెందిన సుమారు 1,200 మంది సత్యసాయి బాబా భక్తులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం సర్వేకు వినతి

నల్లమాడ: నల్లమాడ ఎస్సీ కాలనీలో గ్రామ దేవత సల్లాపురమ్మ ఆలయ స్థలాన్ని సర్వే చేయాలని గ్రామానికి చెందిన గంగాద్రి, నాగేంద్ర, శ్రీరాములు, రమేష్, ధనుంజయ సోమవారం తహసీల్దార్‌ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయం చుట్టూ కొందరు పశువులను కట్టేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రం అవుతున్నాయన్నారు.

పొలాలకు వెళ్లేందుకు రస్తా వదలండి



ధర్నా చేస్తున్న గంగంపల్లి రైతులు

పుట్టపర్తి అర్బన్‌: పొలాలకు వెళ్లే రస్తాకు అడ్డుగా ఓ రైతు పెద్ద బండరాళ్లను వేసి రాకపోకలు అడ్డుకుంటున్నారని గోరంట్ల మండలం డి.గంగంపల్లికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌ వద్ద ధర్నా నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గొని రామక్రిష్ణప్ప తనకున్న పొలాన్ని 2011లోనే సుబ్రమణ్యం అనే క్వారీ యజమానికి విక్రయించారన్నారు. సదరు సుబ్రమణ్యం 2023లో మరో రైతు లక్ష్మీనారాయణ భార్య లలితమ్మకు విక్రయించారని తెలిపారు. అయితే ఆ భూమి తనకే అమ్మాలని, పాత ధరకే అమ్మాలని పట్టుబట్టిన పూర్వ యజమాని గొని రామక్రిష్ణప్ప రోడ్డుకు అడ్డుగా పెద్ద బండరాళ్లను వేసి అడ్డుకుంటున్నారన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి పొలాల్లోకి వెళ్లడానికి రస్తా లేక 50 మందికి పైగా రైతులు ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇదివరకే గోరంట్ల తహసీల్దార్, సర్వేయర్‌ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తమ పొలాల్లోకి వెళ్లేందుకు రస్తా విడిపించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సీజనల్‌ వ్యాధుల నియంత్రణేదీ?

కొత్తచెరువు: ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలకు అపరిశుభ్రత నెలకొని సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్నా ఎటువంటి నియంత్రణా చర్యలు చేపట్టలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేష్‌ సోమవారం తహసీల్దార్‌ కళావతికి ఫిర్యాదు చేశారు. మండల వ్యాప్తంగా డెంగీ, మలేరియా వ్యాధులతో ఇప్పటికే 200 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. తక్షణమే వాటర్‌ ట్యాంకులు శుభ్రం చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్‌పౌడర్‌ చల్లాలని, దోమలు నివారణకు ఫాగింగ్‌ చేపట్టాలని కోరారు.

బ్రెడ్ల పంపిణీ

ధర్మవరం అర్బన్‌: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవ శంకర్‌రావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్‌ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గిర్రాజు రవి, బోయ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా చిత్రపటం ఊరేగింపు

కదిరి టౌన్‌: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని వాణివీధి షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. వాణివీధి, కాలేజ్‌ సర్కిల్, అంబేడ్కర్‌ సర్కిల్‌ మీదుగా పలువీధుల్లో ఊరేగింపు సాగింది. భక్తులు కోలాటాలు ఆడుతూ జానపద గీతాలు ఆలపించారు. భక్తులు ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో బాబా భక్తులు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పూజారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పుష్ప మాలలతో అందంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్షిప్త వార్తలు

18న మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18న ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్‌ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 18న ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

బత్తలపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీకి వెంటనే పరిష్కారం చూపాలని తహసీల్దార్‌ శివశంకర్‌నాయక్‌ మండల అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటూ రెండు అర్జీలు, జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కల్వర్టులను మూసివేస్తున్నారంటూ ఒక అర్జీ, కొలతల కోసం మరొక అర్జీ అందినట్లు తహసీల్దార్‌ వివరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఏపీఎం సుదర్శన్‌రాజు, మండల ఇంజినీర్‌ రమణయ్య, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఎంఈఓ చాముండేశ్వరి పాల్గొన్నారు.

22 నుంచి ఆర్డీటీ క్రికెట్, కబడ్డీ టోర్నీ

ధర్మవరం రూరల్‌: పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో ఈ నెల 22 నుంచి స్కూల్‌ స్థాయిలో క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్‌ నిర్వహించనున్నట్లు కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న పాఠశాలలు ఈ నెల 20లోగా రిజిష్టర్‌ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు క్రికెట్‌ కోసం 99859 29285, కబడ్డీ కోసం 99664 92540 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బత్తలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) వంశీకృష్ణారెడ్డి అధికారులకు, ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టూడెంట్స్‌ కిట్స్‌లో భాగంగా సరఫరా చేసిన బ్యాగులను మండల స్టాక్‌ పాయింట్‌ నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌నాయక్, సీఎస్‌డీటీ శారద, హెచ్‌ఎం జయంతి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నల్లమాడ: శ్రీ సత్యసాయి గ్లోబల్‌ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో సోమవారం దొన్నికోటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్‌ ట్రస్టు మేనేజింగ్‌ ట్రస్టీ రత్నాకర్‌ సూచన మేరకు యునైటెడ్‌ కింగ్‌డమ్‌ నుంచి విచ్చేసిన 45 మంది వైద్య బృందం హాజరై జనరల్‌ మెడిసన్, కళ్లు, చెవి, ముక్కు, గొంతు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, మహిళలు, చిన్న పిల్లల సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బత్తలపల్లి పీర్లకు ఘన స్వాగతం



పోట్లమర్రిలో ఊరేగుతున్న పీర్లు



దుర్గానగర్‌లో పీర్లస్వాముల ఊరేగింపు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లి కాశింస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామాల పర్యటనకు వెళ్లిన పీర్లకు ఘన స్వాగతం లభించింది. బత్తలపల్లి, గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రిలో ఉదయం పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తులు పీర్ల వెంట ఇంటింటికి వెళ్లి చక్కెర చదివించారు. అనంతరం బత్తలపల్లి పీర్లు గంటాపురం చేరుకోగా అక్కడ గ్రామపెద్దలు, పీర్లు వచ్చి ఘనస్వాగతం పలికాయి. అటు తరువాత వేల్పుమడుగుకు చేరుకోగా అక్కడ కూడా అదే తరహాలోనే స్వాగతం లభించింది. చివరగా పోట్లమర్రికి చేరుకోగా అక్కడ బత్తలపల్లి పీర్లకు పోట్లమర్రి పీర్లు ఎదురేగి స్వాగతం పలికాయి. ఊరేగింపుగా గ్రామంలో పర్యటించి బేటీ తీసుకున్నాయి. అనంతరం బత్తలపల్లి పీర్లు రాత్రికి మకాన్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జలధి రోజు శనివారం బత్తలపల్లి కూడలిలో జరిగే బేటీలకు రమ్మని ఆహ్వానించేందుకు కాశింస్వామి తన తమ్ముళ్లుగా భావించి వస్తారని ముజావర్లు తెలిపారు. లింగారెడ్డిపల్లి, వెంకటగారిపల్లి పీర్లు అనంతసాగరం చేరుకుని బేటీ తీసుకున్నాయి. సంజీవపురం పీర్లు ఈదుల ముష్టూరు వెళ్లి అక్కడ బేటీ తీసుకున్నాయి. మాల్యవంతం పీర్లు ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి గ్రామాల్లో పర్యటించాయి. ధర్మవరం రూరల్‌ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లో బందోబస్తు పర్యవేక్షించారు.

భక్తులకు అన్నదానం

మొహర్రం ఉత్సవాల్లో భాగంగా పీర్లస్వాముల వెంట వచ్చిన భక్తులకు, ప్రజలకు గంటాపురంలో మాజీ సర్పంచు సింగారం నాగేష్, శైలజ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బత్తలపల్లి ఎస్సీ కాలనీవాసుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. వేల్పుమడుగులో గ్రామపెద్దలు భోజనాలు ఏర్పాటు చేశారు.

ధర్మవరం అర్బన్‌: మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం పీర్లను ఊరేగించారు. దుర్గానగర్‌లోని పీర్లను ప్రత్యేక పూలు, వస్త్రాలతో అలంకరించి ఊరేగించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించారు.